



కార్పొరేషన్ కార్యాలయంలో ప్లానర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టిపిఒ

కార్పొరేషన్‌లో కాకరేపుతున్న 'నక్ష'..!

- టిపిఒపై ప్లానర్స్ నిరసన గళం
- పని ఒత్తిడంటూ కమిషర్ వద్ద ఏకరువు
- ప్లానర్స్‌పై టిపిఒ ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ 'నక్ష' సర్వే కార్యక్రమం సంబంధిత సిబ్బంది, అధికారుల మధ్య కాక రేపుతోంది. ఈ కార్యక్రమం ముగించటానికి ఇక పది రోజులు మాత్రమే గడువు మిగిలింది. శుక్రవారం నాటికి ఈ సర్వే 68 శాతమే పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ నెల 29 నాటికి నక్ష సర్వే పూర్తి చేయాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ఈ సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారిని తీరుపై ప్లానర్స్ నిరసన గళం విన్పిస్తున్నారు. శుక్రవారం నాడు కమిషనర్ బాలాస్వామి అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్లానర్స్ సమస్యలను ఏకరువు పెట్టారు. రెగ్యులర్ సచివాలయాల్లో సర్వే ప్రక్రియను దాదాపుగా పూర్తి చేశామన్నారు. వెయ్యికి పైగా అసెస్మెంట్‌లపై సర్వే నిర్వహించాల్సి వస్తోందన్నారు. పనిఒత్తిడి ఎక్కువైన నేపథ్యంలో పది రోజుల క్రితమే సహాయకులను ఏర్పాటు చేయాలంటూ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీషకు లిఖితపూర్వకంగా అర్జీ ఇచ్చామన్నారు. పరిసర సచివాలయాల్లో కొంతమంది ప్లానర్స్‌కు 400 అసెస్మెంట్‌లు మాత్రమే ఉన్నాయని, వారికి పని విభజన చేయాలని కోరినా టిపిఒ పట్టించుకోవడం లేదంటూ ప్లానర్స్ ఫిర్యాదు చేశారు. గంటల తరబడి సిస్టమ్స్ ముందు పని చేయాల్సి రావటంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామంటూ ప్లానర్ మైసూరా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కంటి చూపు దెబ్బతినిందని, తలనొప్పి సమస్యలు అధికం అయ్యాయంటూ మరో ప్లానర్ గౌస్ తెలిపారు. ఎర్రపురెడ్డి అనే ప్లానర్ మాట్లాడుతూ వికలాంగుడైన తాను ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాయని చెప్పారు. వెన్నెముక సమస్యతో ఎక్కువ సేపు కుర్చీలో కూర్చోలేకపోతున్నాని తెలియజేశారు. వీటికి తోడు కంప్యూటర్లు మొరాయిస్తున్నాయని, దీనిపైనా టిపిఒకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. వీటిపై కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ త్వరలో మూడు ల్యాప్టాప్‌లు అందుబాటులోకి తెస్తామని అన్నారు. అధిక అసెస్మెంట్లు ఉన్నవారికి వెంటనే సహాయకులను ఏర్పాటు చేయాలని ఆదేశించి సమావేశాన్ని ముగించారు.

టిపిఒ రుసరుసలు

కమిషనర్‌తో సమీక్ష ముగిసిన తర్వాత గుమాస్తాల గది వద్ద టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీష ప్లానర్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా వారితో వాదులాటకు దిగారు. ప్లానర్ ఎర్రపరెడ్డిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు ఎర్రపరెడ్డి అనారోగ్య సమస్యలున్న తనపై పనిగట్టుకుని కక్ష సాధింపునకు పాల్పడుతున్నారంటూ సమాధానం ఇచ్చారు. ప్లానర్స్ ఎదురు ప్రశ్నించడంతో టిపిఒ జవాబు ఇవ్వలేక అక్కడి నుంచే ఉన్నతాధికారికి ఫోన్ చేస్తూ ప్లానర్స్‌పై ఫిర్యాదు చేశారు. మొత్తం మీద పని భారం, అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా నక్ష కార్యక్రమంకు గ్రహణం పట్టుకున్నట్లు కన్పిస్తోంది.

అనంతపురం సర్వజన ఆసుపత్రిలో మహిళా వైద్యులు అసౌకర్యం.. అభద్రత మధ్య విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ విధులు నిర్వహించే కాజువాలిటీ వద్ద కనీసం వాష్‌రూమ్‌లు కూడా లేవు. వాష్‌రూమ్‌లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో విధుల్లో ఉన్న మహిళా డాక్టర్లు క్వార్టర్స్ వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఆ ప్రాంతం మార్గమధ్యంలో నిర్మానుష్యంగా ఉండడంతో అక్కడ పోకిరీల వేధింపులు అధికమవుతున్నాయి. ఇటువంటి ఘటనే ఇటీవలి కాలంలో అనంతపురం సర్వజన ఆసుపత్రి వద్ద చోటు చేసుకుంది.



అసౌకర్యం..అభద్రత..!

- ప్రభుత్వాసుపత్రి మహిళా వైద్యుల కష్టాలు
- రాత్రి సమయాల్లో ఆకతాయిల వేధింపులు
- ఇటీవల ఓ వైద్యురాలిపై పోకిరి వెకిలిచేష్టలు
- ఆలస్యంగా నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం సర్వజన ఆసుపత్రిలో ఈనెల 15వ తేదీన విధుల్లో ఉన్న ఓ మహిళా జూనియర్ డాక్టర్ రాత్రి సమయంలో క్యాజువాలిటీ నుంచి క్వార్టర్స్ వైపు వెళ్తోంది. ఈ సమయంలో ఆ దారిలో కాపు కాచిన ఒక పోకిరి ఆమెపై లైంగిక వేధింపులకు గురిచేసినట్లు తెలుస్తోంది. దీనిపై ఆ డాక్టర్ ఫిర్యాదుతో టుటౌన్ పోలీసులు రంగంలోకి దిగి పోకిరిని అరెస్టు చేశారు. విధులు నిర్వహిస్తున్న చోటే సరైన వసతులుండాలుంటే ఇలాంటి సమస్యలను మహిళా వైద్యులు ఎదుర్కొనే పరిస్థితి ఉండదు. ఇక బ్లడ్ బ్యాంకు వద్ద బ్లడ్ క్రాస్ చెక్ చేసుకునే సమయంలోనూ డాక్టర్ వెళ్లే ప్రాంతంలో నిర్మానుష్యంగా ఉంటోంది. రాత్రి సమయాల్లో అక్కడ కూడా కొంత ఇబ్బందులను మహిళా డాక్టర్లు ఎదుర్కొంటున్నట్టు సమాచారం. పనిచేసే చోటు సరైన వసతులు కల్పించాలని సిబ్బంది కోరుతున్నా దానిపై ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి సరైన స్పందన రావడం లేదు.

చికిత్స నిమిత్తం వెళ్లి.. రాత్రి కాపు కాచి..!

అనంతపురం రూరల్ పరిధిలోని సిండికేట్ నగర్‌కు చెందిన మోహన్ సాయి అనే యువకుడు బీకాం పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఇటీవల ఇతను తనకు దగ్గు రావడంతో చికిత్స నిమిత్తం ఈనెల 13వ తేదీన సర్వజన ఆసుపత్రికి వెళ్లాడు. ఈ సమయంలో అక్కడ విధుల్లోనున్న ఓ జూనియర్ డాక్టర్ అతనికి చికిత్సలు అందించారు. ఆరోజు నుంచి సదరు యువకుడు తనను ప్రేమించాలంటూ వైద్యురాలిని వేధించడం మొదలు పెట్టాడు. ఇది తీవ్రం అయ్యి రాత్రి సమయంలో డాక్టర్ ఒంటరిగా వెళ్తున్న సమయంలో బెదిరింపులకు గురి చేశాడు. అతని నుంచి తప్పించుకుని వెళ్లిన వైద్యురాలు ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎల్. సుబ్రమణ్యం ఫిర్యాదు మేరకు మోహన్‌సాయిని శుక్రవారం నాడు అరెస్టు చేసినట్టు టుటౌన్ సిఐ శ్రీకాంత్ తెలిపారు. కోర్టు ముందు హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు తెలియజేశారు.



అనంతపురం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక, ఐద్వా నాయకులు

వైద్యులకు సరైన వసతులు కల్పించాలి

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పనిచేసే చోట వసతులు కల్పించాలని ప్రజారోగ్య వేదిక, ఐద్వా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు అనంతపురం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎల్.సుబ్రమణ్యంను ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన, రాష్ట్ర నాయకులు ఏజీ.రాజమోహన్, శ్రీనివాసరావు, నగర కార్యదర్శి అశ్వినిలు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. క్యాజువాలిటీ వద్ద వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా విధులు ముగించుకుని రాత్రి సమయాల్లో క్వార్టర్స్‌కు వెలుతున్న వారికి తగిన భద్రతా ఏర్పాట్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్లడ్‌బ్యాంకు వద్ద నిర్మానుష్యంగానున్న చోట కూడా భద్రత కల్పించాలని కోరారు. జూనియర్ డాక్టర్‌పై జరిగిన లైంగిక వేధింపుల అంశంలో ఏమి చర్యలు తీసుకున్నారని నాయకులు సూపరింటెండ్‌ను అడుగగా ఈనెల 15వ తేదిన రాత్రి ఘటన జరిగితే 16వ తేదీ పోలీసులకు ఫిర్యాదు చేసామని చెప్పారు.



ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ ఎంపిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విసి

దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

జెఎన్‌టియు విసి హెచ్. సుదర్శనరావు

ప్రజాశక్తి -అనంతపురం

దేశ నిర్మాణం, పురోభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకం అని జెఎన్‌టియు వైస్‌ఛాన్స్‌లర్ హెచ్.సుదర్శనరావు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జెఎన్‌టియు-2025 పశ్చిమ మండల ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ ఎంపిక కార్యక్రమం శుక్రవారం ప్రారంభం అయ్యింది. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శారద ఆధ్వర్యంలో జరగిన కార్యక్రమంలో విసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపిక శిబిరానికి జెఎన్‌టియు అనుబంధ కళాశాలల నుంచి 60 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఎంపికైన ప్రతిభావంతులు గుజరాత్‌లో జరిగే పది రోజుల ప్రీ-రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొంటారు. అక్కడ ఎంపికైన విద్యార్థులు జనవరి 26, 2026న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో ఎన్ఎస్ఎస్ కంటింజెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శారద తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ హైదరాబాద్ ప్రాంతీయ డైరెక్టరేట్ సంచాలకులు ఎం.రామకృష్ణ, హైదరాబాద్ ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ డైరెక్టరేట్ నుంచి సంజయ్ పాల్గొన్నారు.



యూరియా పంపిణీని పరిశీలిస్తున్న ఏవో కిరణ్‌కుమార్‌రెడ్డి

యూరియా పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని సహకార సంఘం సొసైటీ గోడౌన్‌లో జరుగుతున్న యూరియా పంపిణీని మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి, ఏఈవో మధు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం క్రితం ఆర్‌బికె, సొసైటీల పరిధిలో టోకన్లు తీసుకున్న వారికి యూరియా పంపిణీ చేశామన్నారు.

యూరియా పంపిణీ

అనంతపురం : కందుకూరు గ్రామంలో రైతులకు యూరియాను శుక్రవారం పంపిణీ చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి మురళీకృష్ణ, టిడిపి నాయకులు బాలకృష్ణ, పోతులయ్య, పెద్దన్న, మురళి, పాల మల్లికార్జున, రమేష్, రామచంద్ర, పూల ఓబిరెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది మల్లికార్జున, భరత్ జయచంద్ర రెడ్డి, అపర్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్వీ డిగ్రీ కళాశాలలో వాణిజ్యోత్సవ్-2కె25



విద్యార్థినులతో మాట్లాడుతున్న డా॥ఆంజనేయులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో వాణిజ్యోత్సవ్- 2కె25ను శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ డిగ్రీ కళాశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, బిజినెస్ క్విజ్ వంటి పోటీలు నిర్వహించారు. కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధర రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని వాణిజ్యం, మేనేజ్‌మెంట్ విద్యార్థుల కోసం కంప్యూటర్ సైన్స్ ప్రాధాన్యతను తెలియజేశారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డా॥ఎంఎస్ఆర్.అంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్స్ అవ్వాలని, స్వయం ఉపాధి ప్రారంభించి ఆర్థికంగా స్వావలంబన సాధించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా॥ఎన్ఎవి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డా॥టి.శ్రీనివాసులు, ఏవో. శ్రీనాథ్, కామర్స్ అండ్ మేనేజ్మెంట్ హెచ్ఒడి టి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

సిసి రోడ్డుపై పేరుకుపోయిన మట్టి

ప్రజాశక్తి-యల్లనూరు



రోడ్డుపై ఉన్న చెత్త, బురద

మండల కేంద్రం పాతపేట శివారులోని పోతులయ్య కట్ట, బిసి కాలనీ సమీపంలో సిసి రోడ్డుపై అపరిశుభ్రత నెలకొంది. సిసి రోడ్డు ఏర్పాటు చేసినప్పటి నుంచి దానిపై ఉన్న చెత్తను ఒక్కసారిగా తొలగించిన దాఖలాలు లేవు. అపరిశుభ్రంగా ఉన్న ఆ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరిగాయి. అందులో పాములు సంచారం అధికమై స్థానికంగా ఉన్న ఇళ్లలోకి వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతధికారులు స్పందించి సీసీ రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమాల 'వెలుగు'..!

- ఇష్టానుసారంగా గ్రామ సంఘాల నిర్వహణ
- పెత్తనం అంతా యానిమేటర్లదే
- రుణం మంజూరైతే కమీషన్ ఇవ్వాల్సిందే..!

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండలంలో ఇటీవలి కాలంలో డిఆర్‌డిఎ వెలుగు కార్యాలయంలో అవకతవకలపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళా సంఘాలపై రాజకీయ పెత్తనం పెరిగి ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులొత్తుతూ బుక్‌కీపర్లు, యానిమేటర్లు, వీవోలు వ్యవహరిస్తున్న తీరు మహిళా సంఘం సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వంలో పని చేసిన వివో ఆనిమేటర్లు అందరినీ తొలగించారు. ఈ విషయంపై వారు హైకోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్లు తెచ్చుకున్నా స్థానిక అధికారులు వాటిని బేఖాతర్ చేస్తున్నారు. యానిమేటర్లు అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు బహిర్గం అవుతున్నా ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.ఆత్మకూరు మండల వ్యాప్తంగా యానిమేటర్లు చెప్పిందే వేదం కావడంతో మహిళా సంఘాల పనితీరు కుంటుపడుతోందని కొందరు సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల పుస్తక నిర్వహణపై సీసీల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమాలకు అంతులేకుండా పోతోంది. ప్రతి మహిళా సంఘం నిర్వహణకు బుక్ కీపర్ బాధ్యత వహించాల్సి ఉంది. మూడు లేదా నాలుగు సంఘాలకు ఒక బుక్ కీపర్, ఒక గ్రామాఖ్యా సంఘానికి ఒక యానిమేటర్‌ను ఎంపిక చేసి ఆ సంఘం లావాదేవీలు, మహిళల అభివృద్ధి పనులను యానిమేటర్లకు అప్పగించారు. గ్రామంలో చిన్న సంఘాలకు సైతం బుక్‌కీపర్లు లేకుండా, ఏకంగా యానిమేటర్లు పెత్తనం చెలాయిస్తున్నట్లు తెలుస్తోంది. నిరక్షరాస్యులైన మహిళలకు సంఘం లావాదేవీలు తెలియనివ్వడం లేదు. గుట్టు చప్పుడు కాకుండా మహిళా సంఘాల ఆర్థిక రుణ సంపదను మండలంలో యానిమేటర్లు నొక్కేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వీటిన్నింటినీ పర్యవేక్షించాల్సిన వెలుగు సిసిలు అవినీతి అక్రమాలకు ప్రోత్సాహం అందిస్తున్నారనే విమర్శలున్నాయి. మహిళా సంఘంకు ప్రభుత్వం వెలుగు శాఖ నుంచి అందించే రుణ మంజూరు సమయంలో యానిమేటర్లు ప్రతి సంఘం సభ్యురాలి నుంచి కమీషన్లు తీసుకుంటున్నారు. ఇదేమిటంటే తామూ ఉన్నతాధికారులకు ఇవ్వాలంటూ సమాధానం ఇస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ రుణాలు మంజూరులో కూడా పలు అక్రమాలు చోటు చేసుకున్నట్లు విమర్శలున్నాయి. ఆత్మకూరులో ఇటీవల ఓ యానిమేటర్‌పై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వ్యక్తం అయినా ఉన్నతాధికారులు ఆయనపై చర్యలు తీసుకోలేదు. సదరు యానిమేటర్‌ను తొలగించి దుర్వినియోగం అయిన సబ్‌ప్లాన్ నిధులు జప్తు చేయడంలో నేటికీ జాప్యం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆత్మకూరు మండల సమైక్య పరిధిలో గ్రామ సంఘాలపై విచారణ జరిపి, అక్రమాలను బయటపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు మహిళలు కోరుతున్నారు.



ఆత్మకూరు డిఆర్‌డిఎ వెలుగు కార్యాలయం

'ఇండియా పోస్ట్ పేమెంట్'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-బెళుగుప్ప

ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకును ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. స్థానిక వన్నూరుస్వామి కట్ట వద్ద శుక్రవారం ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతాదారులకు అవగాహన కల్పించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ రూ. 200తో తపాలా ఆఫీస్‌లో ఖాతాదారులుగా చేర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐపిపిబి అసిస్టెంట్ మేనేజర్ నవనీత్, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పోస్ట్‌మాస్టర్ శివ, డాక్టర్ మధుసూదన్‌రావు, మల్లికార్జున, సిబ్బంది ఉమ్మల నాయక్, వన్నూరుస్వామి, శివ, సదానంద, శివానంద, తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి రాజాను కలిసిన నారాయణరెడ్డి

అనంతపురం : రాప్తాడు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇంటికి వచ్చిన వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజాను శుక్రవారం వైసిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నీరుగంటి నారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నారాయణరెడ్డికి రాజా సూచించారు.


జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారిగా డా॥బి.జయలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం

రాయదుర్గం కమ్యూనిటీ ఆసుపత్రిలో చర్మ వ్యాధుల వైద్యురాలిగా పని చేస్తున్న డాక్టర్ బి.జయలక్ష్మి ఉద్యోగోన్నతిపై జిల్లా కుష్టు, ఎయిడ్స్, టిబి అధికారిగా నియమితులయ్యారు. దీంతో శుక్రవారం ఆమె డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవిని కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో కుష్టు, ఎయిడ్స్, టిబి వ్యాధుల నియంత్రణకు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



డిఎంఅండ్ హెచ్ఒతో డా॥బి.జయలక్ష్మి



నిర్మాణ పనులు ఆగిపోయిన పెనుకొండ మెడికల్ కళాశాల వద్ద నిరసన చేపట్టిన వైఎస్ఆర్సిపి శ్రేణులు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి : వైసిపి

పెనుకొండ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీ కరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని వైసిపి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పెనుకొండ మెడికల్ కాలేజీ వద్ద చేపట్టిన ఛలో మెడికల్ కాలేజ్ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల అధ్యక్షులు ఉషశ్రీ చరణ్, అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలను అధికారం చేపట్టి ఏడాదిన్నర దాటినా పూర్తిస్థాయి అమలుకు నోచుకోలేదని విమర్శించారు. విద్య, వైద్యం పేదలకు అందకుండా చేసేలా రాష్ట్ర మంత్రివర్గంలో తీసుకున్న మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండాలనే ఉద్దేశ్యంతో 17 మెడికల్ కాలేజీలను వైఎస్ జగన్ తీసుకువచ్చారన్నారు. పేద వాడికి కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో వైయస్ జగన్ మోహన్ రెడ్డి మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమలో మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, నాయకులు దీపికా, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మడకశిర, పుట్టపర్తి, అనంతపురం, కదిరి, హిందూపురం తదితర ప్రాంతాలకు చెందిన వైసిపి నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డా॥ప్రేమ్ చంద్

పశువైద్యశాల తనిఖీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పశుసంవర్ధక శాఖ జేడీగా డా॥ప్రేమ్‌చంద్ బుక్కరాయ సముద్రం ప్రాంతీయ పశువైద్యశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ఎలా జరుగుతోందని ఆరా తీశారు. పాడి రైతులకు అందుబాటు లో ఉండి వారికి సహాయ సహకరాలు అందించాలని తెలియజేశారు.

రహదారి పనులను పూర్తి చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



జిల్లాలో రహదారుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పనులు పూర్తి అయ్యాక బిల్లులు నెలలోపు ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో పనులు పూర్తి అయ్యాక నెల దాటి ఒక్క బిల్ కూడా పెండింగ్ ఉండడానికి వీలు లేదన్నారు. ఇందులో ఏదైనా తేడా కనిపిస్తే ఉపేక్షించేది లేదన్నారు. వచ్చే నెలకు సంబంధించి ఆర్అండ్‌బి పరిధిలో లక్ష్యం నిర్దేశించుకుని రహదారుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్అండ్‌బి పరిధిలో మంజూరైన ఎండిఆర్ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి ఎన్ఆర్ఈజిఎస్ కింద సిసిరోడ్లు, బిటిరోడ్ల నిర్మాణాలపై దృష్టి సారించి పూర్తి చేయించాలన్నారు. హౌసింగ్ శాఖ కింద అక్టోబర్ 2వతేదీ నాటికి జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రతివారం లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు.

గుంతకల్లులో పడకేసిన పారిశుద్ధ్యం!

రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలు.. కంపు కొడుతున్న వీధులు.. వ్యాధుల బారిన ప్రజలు..

ప్రజాశక్తి-గుంతకల్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ పక్క స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేలా ముందు కెళ్లాలని చెబుతుంటే గుంతకల్లు పట్టణంలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందని చెప్పవచ్చు. అందుకు పట్టణంలోని ప్రతి వార్డులో రోడ్లపై చెత్త కుప్పలు దర్శనం ఇస్తుండడమే నిదర్శ నం. దీంతో వీధులు కంపుకొడుతూ, దోమలు వృద్ధి చెంది స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారుల్లో చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ మార్గంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సైతం రాకపోకలు సాగిస్తుంటా రని, ఆయన కూడా స్పందించకపోవడం శోచనీయ మని పేర్కొంటున్నారు. ప్రధానంగా తిలక్‌నగర్, రాజేంద్రనగర్, పాత గుత్తిరోడ్డు, హనుమేష్‌నగర్, తదితర ప్రాంతాల్లో రోడ్లపై చెత్తకుప్పలు పేరుకుపోయి ఆ ప్రాంతాల ప్రజలు దుర్వాసనతో


గుంతకల్లులో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారానికి ఓ రోజు మాత్రమే ఇంటింటి చెత్త సేకరణకు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు వస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 60 అడుగుల రోడ్డు, మహాత్మగాంధీ రోడ్డులో మాత్రమే రోజూ కమిషనర్ ఫొటోలకు ఫోజులు ఇస్తున్నారని, ఇతర వార్డుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు కనపడ లేదేమో అని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇక కాలనీల్లో దోమల నివారణ చర్యలు ఏమాత్రం చేపట్టకపోవడంతో వ్యాధుల బారినపడి ఆసు పత్రుల పాలవుతున్నారని ప్రజలు వాపోతున్నారు. శానిటరీ విభాగంలో ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు మేస్త్రీలు, 34 సచివాలయాల్లో శానిటరీ సెక్రటరీలు ఉన్నా పట్టణంలో పారిశుధ్య పనులు పూర్తి స్థాయి లో జరగకపోవడం, ప్రధానంగా శానిటేషన్ పనులపై కమిషనర్ పర్యవేక్షణ లేకపోవడంతో సమస్య జటిలంగా మారిందని తెలుస్తోంది. ఇకనైనా కమిషనర్ స్పందించి వార్డుల్లో పారిశు ధ్య పనులు చేపట్టి చెత్తకుప్పలు కంపోస్టుకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను వివరణ కోరేందుకు చరవాణిలో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. ఇక శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి స్పందిస్తూ చెత్త కుప్పలు తరలించేందుకు 3 కంపాక్టర్లు ఉండగా ఒకటి మరమ్మతులకు గురైందని, రెండు పని చేస్తున్నాయని, మరో 11 ట్రాక్టర్లు ఉన్నాయని వాటితో చెత్త కుప్పలు తరలిస్తున్నామని తెలిపారు.

కార్పొరేట్ సెలూన్లకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్ షాపులకు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం క్షవర వృత్తిదారులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపా రు. అయితే కమిషనర్ నయీమ్ అహ్మద్ బయటకు రాకపోవడంతో క్షవర వృత్తిదారుల సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు కమిషనర్ బయటకు వచ్చి వినతి పత్రం తీసుకోగా వారు ఆందోళన విరమించారు. ఆ సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివా సులు మాట్లాడుతూ పట్టణంలో కార్పొరేట్ సెలూన్ల ను తొలగించాలని 15 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధు లు స్పందించలేదన్నారు. కార్పొరేట్ సెలూన్ వల్ల 1500 కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి తలెత్తిందని,


కమిషనర్‌కు వినతి ఇస్తున్న క్షవర వృత్తిదారుల సంఘం నాయకులు

నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్, కౌన్సిలర్లు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బెలగంటి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సూరి, కోశాధికారి బ్రాహ్మ, సంఘం నాయకులు అజయ్, సురేంద్ర, శివ, ఎర్రిస్వామి, చంద్ర, చరణ్, బాల, కుమార్‌స్వామి, బాలకృష్ణ, అనిల్, అంజి, సాగర్, మురళి, ప్రసాద్, పవర్, శేఖర్, గణేష్, రంగా, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

మత్తు పదార్థాలు, మొబైల్ ఫోన్ వాడటం ప్రమాదకరమని ఎస్‌కెయూ విసి ఆచార్య బి.అనిత పేర్కొన్నారు. యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, రైట్ వే ఫౌండేషన్ దత్తత గ్రామమైన మన్నీలలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో బి.ఎడ్ కాలేజీ ప్రిన్సిపల్ డా. సోమశేఖర్ అధ్యక్షతన 'మత్తు పదార్థాల వినియోగం, మొబైల్ వాడటం వల్ల తలెత్తే మానసిక సమస్యలు'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్‌కెయూ విసి ఆచార్య బి.అనిత, రెక్టార్ ఆచార్య జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ ఇ.రమేష్ బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కోర్డినేటర్ డాక్టర్ మురళీధర్, మై భారత్ స్టేట్ కోఆర్డినేటర్ బి.భరత్ హాజరయ్యారు. ముందుగా గ్రామంలో సర్పంచి ఎ.త్రిలోక్ నాయుడు, హెచ్‌ఎం ఏలియాజార్ సహకారంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో


డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్యులు

అవగాహన సమావేశం నిర్వహించారు. అతిథులు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం, అతిగా మొబైల్ ఫోన్ వాడటం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కెహెచ్ మైండ్ కేర్ హాస్పిటల్స్ ఫౌండర్, సైక్రియాటిస్ట్ డాక్టర్ బాలాజీ వ్యసనాలు, వాటి వల్ల జీవితం ఎలా నాశనం అవుతుందో వివరించారు. కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, యూనివర్సిటీ బి.ఎడ్ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

రాయదుర్గం ఎంఇఓగా ఇర్షాద్ మహమ్మద్

ప్రజాశక్తి-రాయదుర్గం

మండల విద్యాశాఖ అధికారిగా ఇర్షాద్ మహమ్మద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురంలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి ఎంఇఓగా వచ్చారు. రాయ దుర్గం ఎంఇఓ-1గా పని చేసిన నాగమణి ఉద్యోగ విరమణ చెందడంతో ఆమె స్థానంలో ఇర్షాద్ మహమ్మద్‌ను నియమించారు. నూతన ఎంఇఓకు ఎపిటిఎఫ్ నాయకులు ఘనంగా స్వాగతం పలికి శాలువాలు, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.రామాంజనేయులు, రూరల్ అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి టి.సునీల్, పట్టణ అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.మల్లికార్జున, అనిల్‌కుమార్, కాశీం, రాజు, పోలిరెడ్డి, కృష్ణమూర్తి, కె.రామాంజనేయులు, హేమలత, అబ్దుల్‌రజాక్, సురేష్, నిజాముద్దీన్, నాగరాజు, ఫయాజ్‌అలీఖాన్, అన్సర్, యాసిర్, యువరాజ్, అనిల్‌కుమార్, మల్లికార్జున, మహేష్,


ఎంఇఓ ఇర్షాద్‌ను సన్మానిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

రవిచంద్ర, దుర్గప్ప, సాంబమూర్తి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

రాయదుర్గం రూరల్ : ఉపాధ్యాయులు, సిబ్బందిని సమన్వయం చేసుకొని విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఎంఇఓ-1గా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ ఇర్షాద్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, హనుమంత రెడ్డి, రమణ, గౌరమ్మ, శ్రీదేవి, పద్మావతి, సిబ్బంది రామాంజనేయులు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

దస్తావేజులేఖరుల పెన్ డౌన్

ప్రజాశక్తి-యాడికి


రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం యాడికిలో దస్తావేజు లేఖరులు పెన్ డౌన్ చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద కార్యకలాపాలు ఆపేసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రైమ్ విధానంలో తలెత్తుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ జాఫర్ సాధిక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దస్తావేజులేఖరులు జూటూరు అబ్దుల్ రజాక్, నరేష్, ఈశ్వరప్ప, నవీన్‌కుమార్, రామకేశవులు, దుర్గ, రుక్కు, గంగ, ప్రసాద్, రంగా, నాగార్జున పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం : సిడిపిఓ

ప్రజాశక్తి-శింగనమల

పౌష్టికాహారంతోనే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సిడిపిఓ చల్లా లలితమ్మ సూచించారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిడిపిఓ చల్లా లలితమ్మ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. జంక్ ఫుడ్స్, స్వీట్స్, సాఫ్ట్ డ్రింక్స్, శారీరక శ్రమ లేకపోవడం, టీవీ, మొబైల్ ఎక్కువగా చూడటం వల్ల పిల్లల్లో ఊబకాయం వస్తుందన్నారు. రాకుండా ఉండడానికి మంచి ఆహార అలవాట్లు పాటించాలన్నారు. ముఖ్యంగా కూరగాయలు తీసుకోవాలని, రోజూ సైక్లింగ్, స్కిప్పింగ్ చేయించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలన్నారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు, మునగాకు, క్యారెట్ పుష్కలంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు కల్పన, వాణిశ్రీ, ధనలక్ష్మి, కౌసల్య, నేతాజీ, ఐసిడిఎస్ సిబ్బంది ఓబులేసు, వలి, అంగన్వాడీ టీచర్లు ప్రమీలమ్మ, భారతి, ఆదిలక్ష్మి, రామాంజనమ్మ, రుషింగమ్మ, అంగన్వాడీ ఆయాలు, గర్భిణులు, బాలింతలు, పాల్గొన్నారు.


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఓ లలితమ్మ


సాధించిన ప్రశంసా పత్రాలతో శ్రీవికాస్ విద్యార్థులు

రాష్ట్రస్థాయి నృత్య పోటీలకు 'శ్రీవికాస్' విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

రాష్ట్ర స్థాయి నృత్య పోటీలకు అనంతపురం నగరంలోని శ్రీ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఎన్.ఎ.జలీల్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నగరంలోని అశోక్‌నగర్‌లో ఉన్న ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి(వెస్ట్రన్, జానపదాలు) నృత్య పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యార న్నారు. ఆ పోటీలోల సుహాన బృందం, మనస్వి బృందం, చిన్మయిశ్రీ బృందం, శశిధర్ బృందం. సోలో విభాగంలో షణ్ముఖ ప్రియ, హేమల్‌సాయి, కార్తీక, అబ్దుల్‌రెహాన్, అశ్వక్ అలీఖాన్, ప్రియాంక, సంహితరెడ్డి ఎంపికయ్యారన్నారు. వారిని కరస్పాండెంట్ జలీల్, డ్యాన్స్ మాస్టర్ ఆది హెచ్‌ఎం అనంతయ్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

రాప్తాడు : ఆర్‌డిటి సంస్థ విదేశీ నిధులకు సంబంధించి ఎఫ్‌సిఆర్‌ఎను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని భీమ్‌రావు యువజన సంఘం నాయకులు కటిక జయరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ విజయ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఆర్‌డిటి ఉమ్మడి అనంతపురం జిల్లాలో దళిత, గిరిజన, అణగారిన కులాల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందన్నారు. అలాంటి సంస్థ నేడు ఆర్థిక వనరుల లేమితో కొట్టుమిట్టాడుతోందని, ఇందుకు కారణం కేవలం కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్ చేయకపోవడమే అన్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల మనోభావాలు అర్థం చేసుకొని ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి నాగప్ప, ఉపాధ్యక్షుడు బాలనాగేంద్ర, ఓబులేసు, ముత్యాలు, రమేష్, ఉమామహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీసుల సురక్ష వాహనంలోని ఎల్‌ఈడి ప్రొజెక్టర్ ద్వారా సైబర్ నేరాలు జరిగే తీరును వివరించారు. అలాగే రోడ్డు భద్రత, బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించే వీడియోలను ప్రదర్శించారు. విద్యార్థులు చైతన్యవంతులు కావాలని కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ సూచించారు. కళాశాల మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త ఫరీసా ఫిర్దోస్ మాట్లాడుతూ అమ్మాయిలు బాల్యవివాహాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి తెలుసుకొని, ఆ విధమైన సమస్యలకు గురైనప్పుడు పోలీసులను ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో శక్తి టీం ఎఎస్‌ఐ విజయ్, హెడ్ కానిస్టేబుల్ నజీర్, ఎన్‌సిసి సిటిఓ బాలనరసింహులు, అధ్యాపకులు కిరణ్, ఎన్‌ఎస్‌ఎస్ పిఓ కోదండరాములు, నారాయణ, నాగప్ప, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'క్వారీ' బాధిత రైతుకు ఆర్డీవో భరోసా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

క్షణికావేశంతో వ్యవహరించడం ఏమాత్రం పనికిరాదని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. క్వారీ కారణంగా జరుగుతున్న నష్టంపై మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామానికి చెందిన రైతు బొమ్మయ్య, కూతురు భారతి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో వైరల్ అయిన సంఘటనపై శుక్రవారం ఆయన స్పందించారు. బాధిత రైతును ఆర్డీఓ కార్యాలయానికి పిలిపించి తహశీల్దార్ భాస్కర్‌తో కలిసి చర్చించారు. క్వారీ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని అంతవరకూ ఎలాంటి నిర్ణయమం తీసుకోవద్దని వారికి సూచించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేస్తామని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

22 నుంచి బ్రహ్మోత్సవాలు

నార్పల : స్థానిక అవధూత శ్రీతిక్కస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన శ్రీచక్ర శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకూ జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తజనం అఖిలాండ బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

రైతులకు తప్పని 'యూరియా' తిప్పలు..!

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఓ వైపు పాలకులు, మరో వైపు అధికారులు రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేదని, రైతులకు సరిపడా అందజేస్తున్నామని ప్రకనటలు చేస్తున్నా వాస్తవ పరిస్థితి అందకు భిన్నంగా ఉంది. ఎక్కడ చూసినా రైతులు యూరియా కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఇందుకు శుక్రవారం బ్రహ్మసముద్రంలో కనిపించిన దృశ్యమే సాక్ష్యం. వివరాలు.. రైతులు యూరియా కోసం ఉదయమే బ్రహ్మసముద్రం గ్రామ సచివాలయం వద్ద పెద్ద ఎత్తున బారులు తీరి నిలబడ్డారు. యూరియా కోసం గంటల తరబడి వేచి ఉండడం కనిపించింది. రైతుకు ఒకటి లేదా 2 బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. మండల వ్యాప్తంగా ఐదు రైతు సేవా కేంద్రాల్లో మాత్రమే యూరియా అందుబాటులో ఉన్నట్లు సమాచారం. మొదటి విడతలో భైరవాణి తిప్ప ఆర్‌ఎస్‌కెలో 280 బస్తాల యూరియా పంపిణీ చేశారు. తక్కిన బ్రహ్మసముద్రం, భైరసముద్రం, బొమ్మగానపల్లి, చెలిమేపల్లిలో పంపిణీ చేయాల్సి ఉంది. శుక్రవారం బ్రహ్మసముద్రం, చెలిమేపల్లిలో పంపిణీ చేశారు. శనివారం భైరసముద్రం, బొమ్మగానిపల్లి కేంద్రాలో రైతులకు యూరియాను పంపిణీ చేయనున్నారు. యూరియా కోసం నానా అవస్థలు పడాల్సి వసుందని రైతులు వాపోతున్నారు. ఉదయం ఇంటి నుంచి వచ్చి రైతు సేవా కేంద్రం గంటల తరబడి వేచి వుంటే సాయంత్రానికైనా యూరియా అందుతుందో లేని పరిస్థితి నెలకొందని రైతులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఏ ఎరువు దుకాణం వద్ద చూసినా స్టాక్ లేదు అని చెబుతున్నారు. దీంతో రైతులను ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తుంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు రైతుల అవసరం మేరకు యూరియా, ఎరువులు, తెగుళ్ల నివారణ మందులు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.


బ్రహ్మసముద్రం సచివాలయం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా పంపిణీ పారదర్శకంగా చేపట్టాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

గ్రామాల్లో ముందుగానే చాటింపు వేసి రాజకీయ జోక్యం లేకుండా రైతులకు అవసరమైన యూరియాను పారదర్శకంగా పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. మల్లికార్జున మాట్లాడుతూ పంటలకు అవసరమైన యూరియా, ఎరువులు అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం తగినంత యూరియా సరఫరా చేయకపోగా, యూరియా వాడకాన్ని తగ్గించుకుంటే రాయితీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం రైతులను వంచించడమే అన్నారు.


ఎడిఎ కార్యాలయంలో వినతి ఇస్తున్న సిపిఎం నాయకులు

యూరియా కొరతను ఆసరాగా చేసుకుని కొందరు దుకాణదారులు అక్రమంగా నిల్వ చేసుకుని అధిక ధరకు అమ్ముకుంటున్నారన్నారు. కావున ఈ ఖరీఫ్‌లో యూరియా అమ్మకాలపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, శంకర్, రమేష్, కృష్ణ నాయక్, ఆంజనేయులు, అశోక్ కుమార్, వన్నూరుస్వామి, అంజి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు విఆర్‌ఎలు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పే స్కేల్ అమలు, ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాలు, తదితర సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ ఆర్డీవో కార్యాలయం ముందు, 22వ తేదీ కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టనున్నటు తెలిపారు. వీరికి తహశీల్దార్ ఎస్.రమాదేవి, విఆర్‌ఓలు కృష్ణ, సుధాకర్, మల్లికార్జున సంఘీభావం తెలిపారు. ధర్నాలో విఆర్‌ఎలు ఓబులేసు, తిమ్మప్ప, హరి, అరుణ్, రాజు, వీరప్పయ్య, రామాంజనేయులు, రంగనాథ, నారాయణస్వామి, సుధాకర్, మల్లికార్జున, ఇతర గ్రామ సహాయకులు ఉన్నారు.

గుత్తి : న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎన్.సుధాకర్, పెద్దన్న స్పష్టం చేశారు.


గుంతకల్లులో ధర్నాలో పాల్గొన్న విఆర్‌ఎలు

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విఆర్‌ఎలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. మోకాళ్లపై నిల్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వేతనాలు, డిఎలు పెంచాలన్నారు. రీ సర్వేలో విధులు నిర్వహించే విఆర్‌ఎలకు టిఎ, డిఎలు ఇవ్వాలని కోరారు. వీరికి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఎన్.వీరన్న మద్దతు పలికారు. కార్యక్రమంలో మండల విఆర్‌ఎల సంఘం నాయకులు చిరంజీవి, నారాయణస్వామి, వై.సుధాకర్,ఎస్.జగదీష్, రాంప్రసాద్, ధన, యుగంధర్, రమణ, వినోద్, ఆది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం

సరైన ఆహారం, సమయానికి వైద్యుల సలహాతో డెంగీ నుంచి రక్షణ పొందవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. పట్టణంలోని వాల్మీకి నగర్‌లో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందే వ్యాధుల్లో డెంగీ ఒకటని, ఇది చిన్న, పెద్ద తేడా లేకుండా ఎవరికైనా ప్రమాదకరమే అన్నారు. సరైన ఆహార అలవాట్లు, పరిసరాల పరిశుభ్రత, సమయానికి డాక్టర్ సలహా తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి బయట పడవచ్చన్నారు. ప్రధానంగా నీటి నిల్వలను తొలగించడం, ఇంటి లోపల, బయట పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ సూర్య, హెల్త్ సెక్రటరీలు సునీత, నాగమణి, ఈశ్వరమ్మ, సరళబాయి, వనజాక్షి, ఆశాలు ఉమ, మారెక్క, ఈశ్వరమ్మ, పద్మ పాల్గొన్నారు.


నీటి నిల్వలను పారబోస్తున్న అధికారులు

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

గుత్తి : రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ఎడిఎ ఎం.వెంకటరాముడు, వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్ సూచిం చారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం ఇండి గ్యాప్(గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్) ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వేరుశనగ పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. గుత్తి పట్టణానికి చెందిన గౌతమిపురి ఎఫ్‌పిఓ వ్యవసాయ శాఖతో అనుసంధానంగా పని చేస్తోందన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం పెంచి నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడమే ఎఫ్‌పిఓ ముఖ్య ఉద్దేశం అన్నారు. 30 మంది రైతులతో కలిసి పొలం బడి నిర్వహిస్తామన్నారు. వారి వెంట ఎఫ్‌పిఓ అధ్యక్షుడు గోపాల్, సహాయకులు వెంకటేష్, శ్రీనివాస్, ఎంపిఇఓ రాజ్యలక్ష్మి, అరుణ, రైతులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

బ్రహ్మసముద్రం : మండలంలోని ఎరుడికి పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయినులు అనసూయ, శివలింగమ్మను శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం రఘుపతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. వీరు ఎరడికెర, గొల్లలహట్టి పాఠశాలల్లో సుదీర్ఘకాలం సేవలు అందించారని కొనియాడారు. అనసూయ, శివలింగమ్మ సొంత నిధులతో పాఠశాలకు రూ. 8 వేల విలువైన పుస్తకాలు, కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రఘుపతి, ఉపాధ్యాయ బృందం కార్తీక్, మేఘన, స్వాతి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు, రఘు, సాయిరాం, శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి

శింగనమల : ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పరిరక్షించాలని ఎంపిడిఓ భాస్కర్ సూచించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 12,700 మొక్కలు నాటించడంతో పాటు వాటిని పరిరక్షించాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, హాస్పిటల్స్, రోడ్డుకు ఇరువైపులా విస్తృతంగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఈఓఆర్‌డి విజయ్‌కుమార్, ఎంఇఓలు నరసింహరాజు, శివప్రసాద్, ఎపిఓ భాగ్యలక్ష్మి, ఎపిఎం ఈశ్వరయ్య, ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికులపై మొండి వైఖరి తగదు

ప్రజాశక్తి-గుత్తి

రైల్వే కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుత్తి అధ్యక్ష, కార్యదర్శులు సుధీర్, శేఖర్‌బాబు పేర్కొన్నారు. 8వ వేతన సంఘం ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ ఎఐఆర్‌ఎఫ్/ఎస్‌సిఆర్‌ఎంయు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని రైల్వే డీజిల్ షెడ్ సిబ్బంది లాబీ కార్యాలయం వద్ద టీ విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ 8వ సిపిసి గెజిట్‌ను తక్షణమే విడుదల చేయాలని, సిపిసిలో కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు పరశురాముడు, దివాకర్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న రైల్వే డీజిల్ షెడ్ ఉద్యోగులు

ప్రిన్సిపల్‌పై విద్యార్థి దాడి

టిసి ఇచ్చి పంపించేసిన డిప్యూటీ డిఇఓ, డీఎస్పీ

ప్రజాశక్తి-శెట్టూరు

మందలించాడనే నెపంతో ప్రిన్సిపల్‌పై ఓ విద్యార్థి దాడి చేసిన ఘటన శుక్రవారం స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. మోడల్ స్కూల్‌లో చరణ్ పదో తరగతి చదువు తున్నాడు. ఈ క్రమంలో ప్రిన్సిపల్ శ్రీరాములు క్రమశిక్షణతో మెలగాలని చరణ్‌ను మందలించాడు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి ప్రిన్సిపల్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై ప్రిన్సిపల్ పోలీసు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డిప్యూటీ డిఇఓ శ్రీనివాసులు, డీఎస్పీ రవిబాబు హుటాహుటిన శెట్టూరు మోడల్ స్కూల్ చేరుకుని ఆ ఘటనపై విచారణ చేపట్టారు. విద్యార్థికి టిసి ఇచ్చి బయటికు పంపించేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని, మిగతా విద్యార్థులను డీఎస్పీ హెచ్చరించారు.

మహిళపై దాడి

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని బసినేపల్లి తండా గ్రామంలో శుక్రవారం చిన్నపాటి విషయంపై ఓ మహిళపై దాడి జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాలు.. మాణిక్యమ్మకు ఇంటి పక్కనే ఉన్న గోవిందునాయక్, పద్మ దంపతులతో చిన్నపాటి విషయంపై గొడవలు ఉండేవి. ఈ క్రమంలో శుక్రవారం వారు మరోసారి గొడవ పడ్డారు. మాటామాటా పెరగడంతో సహనం కోల్పోయిన వారు మాణిక్యమ్మపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. గాయపడిన మాణిక్యమ్మను భర్త బాబునాయక్ గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

తన వ్యవసాయ తోటలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి అందులోని రాగి వైరు, సామగ్రిని ఎత్తుకెళ్లారని శుక్రవారం మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన రైతు సోమశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. గ్రామ శివారులో ఉన్న రైతు సోమశేఖర్ వ్యవసాయ తోటలో ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను దుండగులు తొలగించి ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులోని రాగి వైరు, సామగ్రిని దొంగలించారు. ఇలాంటి సంఘటనే జులై 25వ తేదీన సూగేపల్లి గ్రామంలో కూడా జరిగింది. ఆ సమయంలో రైతులు ఫిర్యాదు చేశారు. వరుస చోరీలతో రైతులు బెంబేలు ఎత్తుతున్నారు. దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తుండడంతో చేతికొచ్చిన పంటలను నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యకం చేస్తున్నారు. ఇకనైనా పోలీస్ అధికారులు స్పందించి దొంగల ఆగడాలను అరికట్టాలని బాధిత రైతులు పేర్కొంటున్నారు.

22న తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి సంతాపసభ

ప్రజాశక్తి-ఆత్మకూరు


తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

వైసిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి, మండలంలోని తోపుదుర్తి గ్రామానికి చెందిన తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి ఈ నెల 12వ తేదీ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన వైకుంఠ సమారాధన కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు అనంతపురం నగరంలోని రామచంద్ర నగర్‌లో ఉన్న ఆయన నివాసంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కుల, మత, పార్టీలకు అతీతంగా తోపుదుర్తి అభిమానులు పాల్గొనాలని భాస్కర్‌రెడ్డి భార్య, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ కవిత కోరారు.

ఘనంగా మస్తానయ్య గంధం మహోత్సవం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని చాగల్లు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి మస్తానయ్య గంధం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముస్లింలు మస్తానయ్య గంధాన్ని మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య గ్రామమంతా ఊరేగించారు. గ్రామ శివారులో ఉన్న గుంటికొండ దగ్గర ఆ గంధాన్ని దించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.